క్లుప్తంగా

ఉత్సాహంగా డ్రెస్ కాంపిటీషన్



కాంపిటీషన్‌లో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

మీర్‌పేట: మీర్‌పేట నారాయణ ఐఐటీ ఒలింపియాడ్ పాఠశాలలో శనివారం పేరెంట్స్, చైల్డ్ ట్విన్నింగ్ డ్రెస్ కాంపిటీషన్ ఉత్సాహంగా జరిగింది. కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు ఒకే రకమైన దుస్తుల్లో హాజరై ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బాబ్జీ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సత్సంబంధాలు ఏర్పడటానికి ఇలాంటి వేడుక ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏజీఎం రవీంద్రబాబు, ఏఓ మాధవి, ఏడీ రాజేందర్, వీ.వీ.ధనలక్ష్మి పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అవసరం



విద్యార్థి నాయకులతో లార్డ్స్ పాఠశాల యాజమాన్యం

బడంగ్‌పేట్: బడంగ్‌పేట లార్డ్స్ స్కూల్లో శనివారం విద్యార్థి నాయకుల ఎన్నికలు నిర్వహించారు. చురుకుగా ఉన్నా విద్యార్థులు ఇందులో పోటీపడ్డారు. ఎన్నుకోబడిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించారు. లార్డ్స్ విద్యాసంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాల స్థాయినుంచే నాయకత్వ లక్షణాలు అలవాటు చేసుకోవాలన్నారు. నాయకత్వ లక్షణాలతో విద్యార్థుల్లో పటిమా, ఏకాగ్రత, కులంకషం, బుద్ధి, ధైర్యం, పోరాడే ప్రతిమ అలవరుతాయన్నారు. ఎన్నికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో డీన్ సతీశ్ కుమార్, ప్రిన్సిపాల్ రామిడి సంతోష్, బానూరు శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌చార్జి రేఖాసాగర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

కందుకూరు: వర్గీకరణపై సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు ఇచ్చిన సందర్భాన్ని పురస్కరించుకొని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌ను ఆ సంఘం నాయకులు సన్మానించారు. శనివారం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మేడి మహేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మంద రాజు, ఉపాధ్యక్షుడు కంద పెద్ద నర్సింహా తదితరులు నగరంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి సన్మానించారు. ఏన్నో ఏళ్ల తర్వాత న్యాయం జరగడం సంతోషాన్ని కలిగించిందని తెలిపారు.

వరద బాధితులకు చేయూతనివ్వాలి



సరూర్‌నగర్‌లో విరాళాలు సేకరిస్తున్న నాయకులు

హుడాకాంప్లెక్స్: కేరళ వరద బాధితులకు ప్రతి ఒక్కరూ చేయూత అందించాలని సీపీఐ సరూర్‌నగర్ మండల సమితి కార్యదర్శి బాతరాజు నర్సింహ పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర సమితి పిలుపు మేరకు శనివారం వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ.. కేరళ వరదల్లో అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయని, ఇలాంటి విపత్కర సమయాల్లో పక్క రాష్ట్రాలు ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మూడురోజుల పాటు సేకరించిన విరాళాలను జిల్లా పార్టీకి అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి కందుల సుధాకర్, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఫైమిదా, ఏఐటీయూసీ కార్యదర్శి ఎం.మద్దిలేటి, కమలమ్మ, పూజారి శ్రీను, అనిత, హేమలత, పార్వతమ్మ, చాంద్‌బీ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతో మానవ మనుగడ

- నాటి సంరక్షించాలి
- జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ వాణిరెడ్డి



పహాడీషరీఫ్: మొక్క నాటుతున్న కమిషనర్ వాణిరెడ్డి

మహేశ్వరం: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఉపాధి హామీ పథకం ఏపీడీ సక్రియా పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని మన్సాన్‌పల్లి, ఉప్పుగడ్డ తండా, పడమటి తండా, కోళ్లపడకల్, సుభాన్‌పూర్, దిలావార్‌గూడ గ్రామాల్లో ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. వన మహోత్సవం కింద నాటిన మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కల పెంపకంతో స్వచ్ఛమైన గాలి, పండ్లు, పూలు, ఔషధాలు, లభిస్తాయన్నారు. వన మహోత్సవంలో ప్రతిఒక్కరూ భాగస్వాములై మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ప్రతీ గ్రామ పంచాయతీల్లో రోడ్లకు ఇరువైపుల, ప్రభుత్వ కార్యాలయాల వద్ద, యువజన సంఘాల కార్యాలయాల వద్ద, పాఠశాలల ప్రహరీల వద్ద, పార్కులు, చెరువు గట్లపైన, కాలువ గట్లపైన మొక్కలు నాటాలన్నారు. ఉపాధి హామీ కూలీలతో గుంతలు తవ్వించి మొక్కలు నాటించారు. వాటి సంరక్షణకు అందరూ కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శైలజ, ఉపాధి హామీ ఏపీఓ పరిమళ, టీఏ మహేందర్, పంచాయతీ కార్యదర్శులు జావీద్ పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

పహాడీషరీఫ్: మానవాళి మనగడకు మొక్కలు అవసరమని, ప్రతిఒక్కరూ నాటి సంరక్షించాలని జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ అల్లూరి వాణిరెడ్డి పేర్కొన్నారు. శ్రీరాం కాలనీలోని గ్రీన్‌సిటీ వెంచర్‌లో స్థానిక కౌన్సిలర్లు ఎనగండ్ల ప్రశాంతి శ్రీధర్ గౌడ్, కెంచె లక్ష్మీనారాయణలతో కలిసి 2,650 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో నాటిన ప్రతీ మొక్కను సంరక్షించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. మొక్కల పెంపకంపై ప్రజలు కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. వన మహోత్సవం ఇన్‌ఛార్జి సుధీర్, టీపీవో హబీబున్నీసా, ఏఈ ఇస్రత్ ఆయేషా, పర్యావరణ అధికారి శ్రీను, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



నాటిన మొక్కల వివరాలు తెలుసుకుంటున్న ఏపీడీ సక్రియా, ఎంపీడీఓ శైలజ



అల్మాస్‌గూడలో డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత

అభివృద్ధి పనులు ప్రారంభం

మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లో అభివృద్ధి పనులను శనివారం మేయర్ చిగురింత పారిజాత ప్రారంభించారు. అల్మాస్‌గూడ 3వ డివిజన్‌లోని రామిడి భూమిరెడ్డి నగర్ కాలనీలో కార్పొరేటర్ రామిడి మాధురి వీరకర్ణారెడ్డితో, బాలాపూర్‌లోని 17వ డివిజన్‌లో డివిజన్ కార్పొరేటర్, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డితో డ్రైనేజీ పనులను మేయర్ పారిజాత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ జ్యోతిరెడ్డి, అల్మాస్‌గూడలో శూరకర్ణారెడ్డి, చప్పిడి సంతోష్‌రెడ్డి, నవారు మల్లారెడ్డి, కుంచె నాగేందర్‌గౌడ్, బాలాపూర్‌లో ఎర్ర జైహింద్, బాల్‌లింగని జంగయ్య, గొరిగె శ్రీశైలం, టేకుల సుధాకర్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం–పచ్చదనంపై సమీక్షా...

కార్పొరేషన్‌లోని సమావేశపు హాల్లో ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛదనం పచ్చదనంపై సమావేశం నిర్వహించారు. డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ రఘుకుమార్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ పారిజాత మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటా

మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్‌ఆర్



మాట్లాడుతున్న కేఎల్‌ఆర్

పహాడీషరీఫ్: ప్రతీ కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్‌ఆర్) అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలంతా సిద్ధంగా ఉండాలన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందన్నారు. వార్డుల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసుకొని, స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చొరవ చూపాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కల నేతృత్వంలో మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధిలో కొత్త పుంతలు తొక్కనుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోండి

కందుకూరు: ఆర్టీసీ బస్సు సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ వెంకట సర్సప్ప కోరారు. ఇబ్రహీంపట్నం నుంచి మండల పరిధిలోని అగర్‌మియాగూడను కలుపుతూ నూతన బస్సు సర్వీసును ఏర్పాటు చేశారు. ఆ బస్సు సర్వీసును శనివారం గ్రామస్తులతో కలిసి ఆయన పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజు ఉదయం 6.30 గంటలకు ఇబ్రహీంపట్నంలో ప్రారంభమై తిమ్మాపూర్ మీదుగా లేమూరు, అక్కడి నుంచి అగర్‌మియాగూడ వచ్చి తిరిగి తిమ్మాపూర్ మీదుగా 8.15 గంటలకు ఇబ్రహీంపట్నం చేరుకుంటుందన్నారు. మళ్లీ సాయంత్రం 6.20 గంటలకు ఇబ్రహీంపట్నంలో ప్రారంభమై అగర్‌మియాగూడ మీదుగా లేమూరుకు 7.15 గంటలకు చేరుకొని, తిరిగి 8.05 గంటలకు ఇబ్రహీంపట్నంకు వెళ్తుందన్నారు. అందరూ బస్సు సర్వీసును ఉపయోగించుకొని ఆర్టీసీకి ఆదాయం పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రాజేశ్, స్థానిక నాయకులు వడ్డేపల్లి రేవంత్‌రెడ్డి, లిక్కి జంగారెడ్డి, భూపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సీహెచ్ రవీందర్, పాండు, గణేశ్, పెద్దిరాజు, దశరథ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



అగర్‌మియాగూడలో బస్సును ప్రారంభిస్తున్న మేనేజర్, గ్రామస్తులు

బహిరంగంగా చెత్తవేసిన వ్యక్తికి జరిమానా



జరిమానా రసీదును అందిస్తున్న శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి

బడంగ్‌పేట: ఓపెన్ నాలాలో చెత్త వేసిన వ్యక్తికి కార్పొరేషన్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వంకాయల యాదగిరి శనివారం జరిమానా విధించారు. మేయర్ పారిజాత, కమిషనర్ రఘుకుమార్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని ఓపెన్ నాలాలో ఉదయం పూట కవర్లలో మూటకట్టి చెత్తను విసిరివేస్తుండగా అట్టి వ్యక్తిని పట్టుకొని మున్సిపల్ కార్యాలయానికి పట్టుకొచ్చి రూ.500 జరిమానా విధించి రసీదును అందజేశారు. ఓపెన్ ప్లాట్లు, మెయిన్‌రోడ్లు, పరిసర ప్రాంతాల్లో, నాలాల్లో చెత్తను ఎవరు వేస్తున్న వారికి జరిమాన విధిస్తున్నట్లు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి హెచ్చరించారు. అందుకోసం ఉదయం తెల్లవారు జామునుంచే సిబ్బందిని చెత్త వేస్తున్న ప్రదేశాలలో గూఢచారులుగా నియమించామని తెలిపారు. ప్రజలు, పలు కాలనీవాసులు ఈ విషయం గమనించి స్వచ్ఛ బడంగ్‌పేట కార్పొరేషన్‌కు సహకరించాలని కోరారు. కాలనీలకు వస్తున్న చెత్త సేకరణ ఆటోల్లోనే చెత్తను వేసి సహకరించాలన్నారు. కాలనీవాసులు సహకరించాలని లేదంటే ప్రభుత్వపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కంటిచూపుపై జాగ్రత్తలు తప్పనిసరి

పహాడీషరీఫ్: కంటిచూపు పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జల్‌పల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు షేక్ అఫ్జల్ అన్నారు. వాదే ముస్తఫా బస్తీలో శుక్రవారం స్థానిక ప్రజల సౌకర్యార్థం నేషనల్ హ్యూమన్ రైట్స్, సోషల్ జస్టిస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు వైద్యసేవలను పొందారు. కార్యక్రమంలో సంస్థ జాతీయ ఉపాధ్యక్షుడు బసారుతుల్లా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఎ.హమీద్, స్థానిక బీఆర్‌ఎస్ నాయకుడు సయ్యద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్: మున్సిపాలిటీ పరిధిలోని సోలీపూర్ గ్రామ శివారులో ఉన్న చౌడమ్మగుట్ట హనుమాన్ దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి పల్లకిసేవ ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు రఘుపతిశర్మ, రాఘవేంద్రాచార్య, కృష్ణ, ప్రమోద్, సునీల్ ఆధ్వర్యంలో పత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పులిమామిడి శ్రీశైలంగౌడ్, భాస్కరాచారి, అంచ రాములు, అన్నారం రఘు, గడ్డమీది రమేశ్, రఘునందన్‌రెడ్డి, క్యాసెట్ శ్రీనివాస్, కిషన్‌నాయక్, రాఘవేందర్, నారాయణ, వీర్లపల్లి కృష్ణయ్య, లక్ష్మీకాంత్‌రెడ్డి, శంకరయ్యాయాదవ్, బచ్చన్న, యాదగిరి, ప్రవీణ్‌గౌడ్, పద్మావెంకటేశ్, గోరియానాయక్, సత్తయ్య, హన్మంత్‌రెడ్డి, రవీందర్, సింగపాగ లక్ష్మయ్య పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

సీఐ భూపాల్‌శ్రీధర్



మాట్లాడుతున్న సీఐ భూపాల్‌శ్రీధర్

చేవెళ్ల: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాడుపడాలని చేవెళ్ల సీఐ భూపాల్‌శ్రీధర్ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీసత్యసాయి గ్రామర్ హైస్కూల్‌లో శనివారం విద్యార్థులు హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించి చేవెళ్లలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయం సమీపంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ భూపాల్‌శ్రీధర్ మాట్లాడుతూ.. మానవ మనుగడకు మూలాధారమైన అడవులను కాపాడి వన్యప్రాణుల సంరక్షణకు మనమెంతో కృషి చేయాలన్నారు. అడవుల అభివృద్ధికి కృషి చేయటంతో పాటు రహదారుల వెంట గ్రామీణ ప్రాంతాల వీధుల్లో ప్రభుత్వ కార్యాలయల్లో పాఠశాలల ఆవరణలో ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడే మొక్కలు పెంచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా హరితహారాన్ని ప్రోత్సహిస్తూ విరివిగా మొక్కలు నాటాలని సూచిస్తోందన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ నల్లా నాయకుడు, ప్రిన్సిపాల్ స్నేహలతశ్రీ, అరుణ్, ఏఓ శివరామ్, మహేందర్‌రెడ్డి, పీఈటీ మల్లేశ్ రాము, నవీణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణ పోరాట ఫలితమే వర్గీకరణ

పహాడీషరీఫ్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ మూడు దశాబ్దాల పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టులో అనుకూలమైన తీర్పు వెలువడిందని ఎమ్మార్పీఎస్ జల్‌పల్లి శ్రీరాం కాలనీ నాయకురాలు జి.సంధ్య మాదిగ అన్నారు. సుప్రీం కోర్టులో వెలువడిన తీర్పును పురస్కరించుకొని శుక్రవారం రాత్రి డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్, మంద కృష్ణమాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సంధ్య మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పుతో మాదిగలు, మాదిగ ఉపకులాలకు ఎంతో మేలు జరుగనుందన్నారు. కార్యక్రమంలో నాయకులు చల్ల భద్రమ్మ, యంజాల నర్సింహా, గద్దల రవీందర్, యాదగిరి, యంజాల శివకుమార్, జి.ఆర్.దానయ్య, యంజాల అర్జున్ మాదిగ, బాల్‌రాజు, రాజేష్, జగన్, శ్రీనివాస్, మల్లేశ్, రేణుక, హరి ప్రసాద్, కవిత తదితరులు పాల్గొన్నారు.



సంబురాలు నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

శ్రావణ పూజలకు ఆలయం ముస్తాబు

- రేపటి నుంచి నెలరోజులపాటు ప్రత్యేక పూజలు
- ఏర్పాట్లు చేస్తున్న ఆలయ నిర్వాహకులు



ముస్తాబైన సంగమేశ్వర దేవాలయం



ఆలయంలో కొనేరు



గర్భగుడిలో కొలువైన శివయ్య

మొయినాబాద్‌రూరల్: భక్తుల కొంగు బంగారంగా ప్రసిద్ధి చెందిన ప్రకృతి అందాలలో నిర్మించిన సంగమేశ్వర దేవాలయం భక్తులకు ఆహ్లాదాన్ని పంచుతోంది. భక్తుల కోరికలు తీరుస్తూ కొంగుబంగారంగా విరజల్లుతోంది. మండల పరిధిలోని కనక మామిడి సమీపంలో ఈ ఆలయం ఉంది. మూడు ప్రవాహిక వంకల కలయికతోనే ఇక్కడ సంగమేశ్వర దేవాలయం ఏర్పడింది. ఈ ఆలయం 400 ఏళ్ల కింద నిర్మించారు. ఈ ప్రదేశంలో మూడు వాగులు కొండల మధ్య నుంచి ప్రవహిస్తూ ఏర్పడిన పవిత్ర సంగమంతో శివలింగం దర్శనం ఇవ్వడంతో పూర్వీకులు ఇక్కడ ఆలయం నిర్మించారని పేర్కొంటారు. ఈ ఆలయం దాదాపు ఏడు ఎకరాలలో విషాలముగా నిర్మించారు. ఆలయం పక్కనే కోనేరు, తాడిపత్రి చెట్టు ఎకరం స్థలంలో విస్తరించి ఆకర్షనీయంగా నిలుస్తోంది. ఆలయ విశిష్టత త్రివేణి సంగమం వద్ద ఏర్పడిన ఈ సంగమేశ్వర ఆలయంలో గోధుమ రంగులో ఉండే శివలింగానికి మహిమలు ఉన్నాయని అర్చకులు చెబుతుంటారు. అభిషేకాలు చేసే సమయాల్లో ఈ శివలింగం కదులుతుందంటారు. ఇక్కడికి భక్తులు జంట నగరాలతో పాటు వివిధ జిల్లాల నుంచి ప్రతి సోమవారం వేలాదిగా తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి ముడుపులు కడతారు.

రేపటి నుంచి శ్రావణమాసం ప్రత్యేక పూజలు

ఆగస్టు నెలలో మొదలయ్యే శ్రావణమాసం మొదటి సోమవారం ఈ నెల 5వ తేదీన ప్రారంభమవుతుంది. దేశంలోనే అమావాస్య ఆదివారం రావడం ఇదే మొదటిసారి అని పూజారులు పేర్కొంటున్నారు. శ్రావణమాసం మొదటి సోమవారం 5వ తేదీన ఉదయం గణపతి హోమం, రుద్రాభిషేకం, రెండో సోమవారం 12వ తేదీన సహస్ర కలశాభిషేకం, మూడో సోమవారం 19వ తేదీన పుష్పార్చన, మహామంగళ హారతి, 4వ సోమవారం 26వ తేదీన అమ్మవారికి శ్రీ చక్ర కుంకుమార్చన నిర్వహిస్తారు. 5వ సోమవారం సెప్టెంబర్ 2వ తేదీన రుద్రాభిషేకం, అన్నపూజ, ఆకు పూజ, మహా మంగళహారతి, భజనలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా శ్రావణమాసం పూజా కార్యక్రమాల్లో భాగంగా నెలరోజుల పాటు సంగమేశ్వర దేవాలయంలో ప్రతిరోజు రాత్రి భజన కార్యక్రమాలు జరుగుతాయని పూజారులు తెలిపారు. ఈ శ్రావణ మాసం నెలలో ఐదు సోమవారాలు రావడం మంచి పరిణామం అని తెలిపారు. ఈ సంగమేశ్వర దేవాలయానికి వచ్చే భక్తులందరికీ అన్నదాన కార్యక్రమంతో పాటు ఆలయంలో ప్రత్యేక పూజలు, తీర్థప్రసాదాలు ఉంటాయని తెలిపారు. నెలరోజుల పాటు జరిగే శ్రావణమాసం పూజలను విజయవంతం చేయలని ఆలయ పండితులు కోరారు.